ఇందిరమ్మ ఇండ్ల సర్వే త్వరగా పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

రాజాపేట, డిసెంబర్ 18 : ఇందిరమ్మ ఇండ్ల సర్వే వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పక్కాగా లబ్ధిదారుల వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సర్వేలో అవకతవకలకు పాల్పడితే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అంతకు ముందు తాసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తాసీల్దార్ దామోదర్, ఎంపీడీఓ నాగవేణి అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డులను పరిశీలించి భూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీఓ ఆవుల కిషన్, ఆర్ఐ రమేశ్ ఉన్నారు.

లక్ష్మమ్మ, కృష్ణారెడ్డికి మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి సంతాపం

లక్ష్మమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, నాయకులు

భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 18 : మున్సిపాలిటీలో మాజీ జడ్పీటీసీ కోట పుష్పలత తల్లి సామల లక్ష్మమ్మ, ఇంద్రియాల గ్రామంలో బుర్రి కృష్ణారెడ్డి సంతాప సభలను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి హాజరై లక్ష్మమ్మ, కృష్ణారెడ్డి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఇంద్రియాల గ్రామంలో బీఆర్ఎస్ మహిళా కార్యకర్త రేవల్లి భాయమ్మ మృతదేహాన్ని సందర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ కందాల భూపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

చెక్కు అందజేస్తున్న పోచంపల్లి బ్యాంకు చైర్మన్ రమేశ్

భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 18 : పోచంపల్లి బ్యాంకు అందిస్తున్న అధునాతన సేవలు, ఇన్సూరెన్స్ పాలసీలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని పోచంపల్లి బ్యాంకు చైర్మన్ తడక రమేశ్ అన్నారు. పట్టణానికి చెందిన బ్యాంకు ఖాతాదారుడు కుడికాల వెంకటేశం ఇటీవల మృతిచెందాడు. న్యూ ఇండియా ఇన్సూరెన్స్ సౌజన్యంతో ఖాతాదారులు, వాటాదారులకు అందిస్తున్న ప్రమాద బీమా రూ.1,25,000 చెక్కును బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీజేపీఏ, జేపీఏలను వినియోగించుకోవాలన్నారు. బ్యాంకు అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ సీత శ్రీనివాస్, వైస్ చైర్మన్ భారత రాజేంద్ర ప్రసాద్, సీనియర్ మేనేజర్ రాచకొండ మధుసూదన్, మేనేజర్ రచ్చ శ్రీనివాస్, డైరెక్టర్లు బాలసుబ్రమణ్యం, హరిశంకర్, రమేశ్, వేణు, కావ్య, భార్గవి, ఎల్లస్వామి, నరసింహ, భాస్కర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని గ్రామపంచాయతీ సిబ్బంది ధర్నా

మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 18 : ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ సిబ్బంది బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకుడు కూరెళ్ల కిష్టయ్య మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బంది బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. కనీస వేతనం నెలకు రూ.18వేలు ఇవ్వాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నోముల స్వామి, నాయకులు రమేశ్, మల్లయ్య, కిష్టయ్య, శ్రీను, లక్ష్మయ్య, లలిత, లక్ష్మి, రామక్క పాల్గొన్నారు.

గ్రంథాలయ బకాయిలు చెల్లించాలని వినతి

మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అవేస్ ఉర్ రెహమాన్ చిస్తీ

యాదగిరిగుట్ట, డిసెంబర్ 18 : గ్రంథాలయానికి రావాల్సిన సెస్ బకాయిలు వెంటనే చెల్లించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ అవేస్ ఉర్ రెహమాన్ చిస్తీ కోరారు. యాదగిరిగుట్ట పట్టణంలోని గ్రంథాలయాన్ని బుధవారం సందర్శించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ అజయ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేసి పెండింగ్ బకాయిలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలను నెల రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. కంప్యూటర్లతోపాటు ఇతర మౌలిక వసతులు కల్పించి అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ ఎరుకుల సుధ, గ్రంథాలయ కార్యదర్శి సుధీర్, అధికారి రుకోధర్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

విద్యార్థిని అఖిలను పరామర్శిస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, సీపీఎం మండల కార్యదర్శి స్వామి

వలిగొండ, డిసెంబర్ 18 : మండలంలోని లోతుకుంట మోడల్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థినులపై దాడి చేసి గాయపరిచిన ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వేముల నాగరాజు కోరారు. గాయపడిన విద్యార్థిని గోగు అఖిలను బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విచక్షణ మరిచి విద్యార్థినులపై దాడి చేసిన ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకొని గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి పాల్గొన్నారు.

గొర్రెలకు పీపీఆర్ టీకాలు పంపిణీ

గొర్రెలకు టీకాలు వేస్తున్న పశు వైద్య సిబ్బంది

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 18 : మండలంలోని వీరవెల్లి గ్రామంలో ప్రభుత్వ సహకారంతో బుధవారం గొర్రెలకు ఉచితంగా పీపీఆర్ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెటర్నరీ లైవ్ స్టాక్ అసిస్టెంట్ బూషబోయిన నరసింహయాదవ్ మాట్లాడుతూ గొర్రెల కాపరులు వైద్యుల సలహాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో గొర్ల కాపరుల సంఘం అధ్యక్షుడు దయ్యాల మహేశ్, కార్యదర్శి తోటకూర అశోక్, డైరెక్టర్లు జిట్టా శ్రీను, మోటె ఉప్పలయ్య, రేగు సుగుణమ్మ, రేగు ఆండాలు, కృష్ణ పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లలో మోసాలకు పాల్పడితే చర్యలు

- డీఎంఓ సబిత

మోత్కూరు వ్యవసాయ మార్కెట్‌లో పత్తి కొనుగోళ్ల వివరాలను పరిశీలిస్తున్న డీఎంఓ సబిత

మోత్కూరు, డిసెంబర్ 18 : పత్తి కొనుగోలు కేంద్రాల్లో రైతులను మోసాలకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంఓ సబిత హెచ్చరించారు. మోత్కూరు వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో మార్కెట్ పరిధిలోని మిల్లులు కొనుగోలు చేసిన పత్తి వివరాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 12 పత్తి మిల్లుల ద్వారా 19,593 మంది రైతుల నుంచి 47,76,777 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. రూ.3,267 కోట్లను 17,915 మంది రైతులకు చెల్లించినట్లు తెలిపారు. రెండు రోజుల కింద కొనుగోలు చేసిన బిల్లులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ బిల్లులను మహబూబ్‌నగర్ బ్రాంచీకి పంపిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కానున్నట్లు తెలిపారు. భూమి పత్రాలు, ఆధార్ కార్డులు, బ్యాంకు ఖాతాల సమస్యలు ఉన్నందున కొందరి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని సరిచేసి త్వరలోనే బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో ఐదు వ్యవసాయ మార్కెట్లకు గానూ చౌటుప్పల్ మినహా అన్ని మార్కెట్లకు పాలకవర్గాలను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ధాన్యం కొనుగోలు కోసం పీపీసీ సెంటర్లకు తాము ప్యాడీ క్లీనర్లు, పట్టాలు, తేమను పరిశీలించే యంత్రాలను అందజేశామని తెలిపారు. కొనగోళ్లు ముగిసిన తర్వాత వాటిని తిరిగి మార్కెటింగ్ శాఖకు అప్పగించాలని సూచించారు. ఆయన వెంట సీసీఐ ఇన్‌చార్జి రేణికుంట్ల రవీందర్, మార్కెట్ సెక్రటరీ ఉమా మహేశ్వర్, సిబ్బంది ఉన్నారు.

గ్రామీణ గ్రంథాలయాలను కాపాడుకోవాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెహమాన్ చిస్తీ

తుర్కపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెహమాన్ చిస్తీ

బొమ్మలరామారం, డిసెంబర్ 18 : గ్రామాల్లోని గ్రంథాలయాలను కాపాడుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు ఎండీ అవేస్ ఉర్ రెహమాన్ చిస్తీ అన్నారు. మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలుగా ఉపయోగపడుతాయన్నారు. వాటిని ఆధునీకరించడం, అన్ని రకాల పుస్తకాలు అందుబాటులోకి తేవడం, మౌలిక వసతుల అభివృద్ధికి గ్రామస్తులు సహకారం అందించాలని కోరారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమయ్యే పుస్తకాలను గ్రంథాలయాల్లో అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి రుకోధర్, భువనగిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బైసు రాజేశ్, మాజీ సర్పంచ్ రాంపల్లి మహేశ్‌గౌడ్, బాలరాజు, ఈశ్వర్ పాల్గొన్నారు

గ్రంథాలయ భవన నిర్మాణానికి కృషి

తుర్కపల్లి : మండల కేంద్రంలో నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ రెహమాన్ చిస్తీ అన్నారు. మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయాన్ని బుధవారం ఆయన సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానికులతో కలిసి భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు.

గ్రంథాలయం తనిఖీ

బీబీనగర్ : మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ అవేస్ రెహమాన్ చిస్తీ ఆకస్మిక తనిఖీ చేశారు. సౌకర్యాలను పరిశీలించారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ కార్యదర్శి ఎం.సుధీర్, గ్రంథ పాలకులు జి.రాజ్యలక్ష్మి, సీహెచ్ రుకోధర్ ఉన్నారు.

నర్సాపురంలో పశువుల చోరీ

వలిగొండ, డిసెంబర్ 18 : మండలంలోని నర్సాపురం గ్రామంలో దొడ్డిలో కట్టేసిన పశువులను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపురం గ్రామానికి చెందిన కావటి రాజలింగయ్య తనకు ఉన్న ఒక ఆవు, ఒక గేదె, రెండు దూడలను ఆదివారం సాయంత్రం వ్యవసాయ పొలం వద్ద దొడ్డిలో కట్టేసి ఇంటికి వచ్చాడు. సోమవారం ఉదయం వెళ్లి చూడగా పశువులు కనిపించలేదు. చోరీకి గురైనట్లు గుర్తించి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

గోవులను తరలిస్తున్న వాహనాలు సీజ్

భువనగిరి అర్బన్, డిసెంబర్ 18 : గోవులను అక్రమంగా తరలిస్తున్న మూడు వాహనాలను పట్టణ పోలీసులు బుధవారం సీజ్ చేశారు. భువనగిరి బైపాస్ మీదుగా హైదరాబాద్‌కు గోవులను తరలిస్తున్న మూడు వాహనాలను చూసి గుర్తు తెలియని వ్యక్తి 100 నంబర్‌కు ఫోన్ చేశాడు. పట్టణ పోలీసులు వెంటనే బైపాస్ రోడ్డు మార్గంలో వెళ్తున్న వాహనాలను పట్టుకున్నారు. విచారణ చేయగా.. వైజాగ్‌లోని అరమండి సంత నుంచి 36 దూడలను హైదరాబాద్‌లోని బహదూర్‌పురాకు తరలిస్తున్నట్లు చెప్పారు. వాహనాలను సీజ్ చేసి గోవులను గోశాలకు తరలించినట్లు పట్టణ ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రేపు పెన్షనర్స్ దినోత్సవం

మోత్కూరు, డిసెంబర్ 18 : రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల దినోత్సవం శుక్రవారం జరుగనుందని ఆ సంఘం మోత్కూరు యూనిట్ కార్యాలయం ప్రధాన కార్యదర్శి ఆకవరం వల్లబాయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 70సంవత్సరాలు పూర్తి చేసుకున్న 14మంది విశ్రాంత ఉద్యోగులను సన్మానించనున్నట్లు తెలిపారు. యూనిట్ కార్యాలయం పరిధిలోని మోత్కూరు, ఆత్మకూరు(ఎం), గుండాల, అడ్డగూడూరు మండలాల పరిధిలోని విశ్రాంత ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అదుపుతప్పి ఢీకొన్న వాహనాలు

భువనగిరి అర్బన్, డిసెంబర్ 18 : పట్టణంలోని బైపాస్ రోడ్డు మార్గంలో అదుపుతప్పిన వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న కారు భువనగిరి బైపాస్ రోడ్డు మార్గంలో ఓవర్‌టేక్ చేస్తున్న క్రమంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రాక్టర్‌కు కుడివైపున ఢీకొట్టింది. దాంతో అదుపుతప్పిన కారు ఇదే మార్గంలో పక్కనుంచి వెళ్తున్న మరో కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు కార్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాబోయేది ప్రజా పోరాటాల కాలమే

- సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

భువనగిరి అర్బన్, డిసెంబర్ 18 : రాబోయేది ప్రజా పోరాటాల కాలమేనని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. పట్టణంలోని సుందరయ్య భవనంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చౌటుప్పల్‌లో 15, 16, 17 తేదీల్లో జరిగిన పార్టీ జిల్లా మహాసభల్లో ప్రజా సమస్యలు, జిల్లా సమగ్రాభివృద్ధిపై చర్చించి అనేక తీర్మానాలు చేసి పోరాటాల రూపకల్పన చేశామన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధి, చిన్ననీటి ప్రాజెక్టులు, ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీసే పరిశ్రమలు, కార్మికుల వేతనాలు, రైతుల సమస్యలు, మహిళా సంరక్షణ తదితర సమస్యలపై పోరాటం చేస్తామని తెలిపారు. రామన్నపేట మండలంలో నిర్మించతలపెట్టిన అంబుజా సిమెంట్ కంపెనీకి వ్యతిరేకంగా పోరాటాలకు సీపీఎం శ్రీకారం చుట్టబోతుందన్నారు. మూసీ ప్రక్షాళన, గోదావరి జలాల సాధన, బస్వాపూర్ రిజర్వాయర్ పూర్తి కోసం ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ట్రిపుల్ ఆర్ బాధితుల కోసం, రాచకొండ భూములకు పట్టాదారు పాస్ పుస్తకాల కోసం, చిన్న నీటి ప్రాజెక్టులైన పిలాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి, బునాదిగాని, ఆసిఫ్‌నెహర్ కాల్వల పూర్తి కోసం ప్రజా పోరాటాలు చేస్తామని తెలిపారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టుపల్లి అనురాధ, నాయకులు బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, దయ్యాల నర్సింహ, కృష్ణ, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, వెంకటేశ్, రాజు, రాంబాబు పాల్గొన్నారు.

పంటలకు మద్దతు ధర కల్పించాలి : ఏఐకేఎంఎస్

ఏఓ జగన్మోహన్ ప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

ఆలేరు టౌన్, డిసెంబర్ 18 : రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో ఏఓ జగన్మోహన్ ప్రసాద్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండించిన పంటలకు మద్దతు ధర రాక రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు కనీస మద్దతు ధర ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుబంధు అమలు చేయాలని, కౌలు రైతులను గుర్తించి రైతు భరోసా పథకం వర్తింపచేయాలని అన్నారు. ఎరువులు, పురుగు మందుల ధరలు తగ్గించి రైతులకు సబ్సిడీపై అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఇక్కిరి సహదేవ్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు అడవయ్య, నాయకులు మామిడాల సోమయ్య, బాలమల్లేశ్, సిద్దేశ్వర్, బీరయ్య, రాందాస్ పాల్గొన్నారు.

కుక్కలు, కోతుల బెడదను నివారించాలి : సీపీఐ

మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

యాదగిరిగుట్ట, డిసెంబర్ 18 : మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు, విద్యార్థులను ఇబ్బందికి గురిచేస్తున్న కుక్కలు, కోతులను నివారించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు కోరారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ అజయ్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. పట్టణంలో కుక్కలు ప్రజలపై దాడిచేసి గాయపరుస్తున్నాయన్నారు. పలువురు తీవ్రగాయాలతో ఆస్పత్రుల పాలయ్యారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు పెంటయ్య, సీపీఐ మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, నాయకులు మహేందర్, రాములు, బంగారు, బాలకిషన్, రాజు, మల్లయ్య, నర్సింహ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆమరణ నిరాహార దీక్ష


ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న నరేందర్

భువనగిరి అర్బన్, డిసెంబర్ 18 : ప్రజలకు కావాల్సిన విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు సాధన కోసం ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నల్ల నరేందర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష బుధవారం రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం, నిరుద్యోగులకు ఉపాధి, భూమిలేని వారికి ఎకరం భూమి, ఇల్లు లేనివారికి 200 గజాల ఇంటి స్థలం కేటాయించే వరకు దీక్షను విరమించబోనన్నారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, నాయకులు లింగస్వామి, శాంతికుమార్, శివ, శ్రీకాంత్, సాయి, నరేందర్, స్వామి, వెంకటేశ్ పాల్గొన్నారు.

పిలాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి కాల్వల పునరుద్ధరణకు రూ.210.11 కోట్లు విడుదల

యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ) : నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల పరిధిలో ఉన్న పిలాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి కాల్వల పునరుద్ధరణకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. పిలాయిపల్లి కాల్వ మరమ్మతుల కోసం రూ.86.22కోట్ల విడుదలకు పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ధర్మారెడ్డిపల్లి కాల్వ పునరుద్ధరణకు రూ.123.89కోట్లు విడుదల చేస్తూ జీఓ జారీ చేసింది. ఈ మేరకు బుధవారం నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో మిగిలిపోయిన కాల్వ పనులను పూర్తి చేయనున్నారు. కాల్వ మరమ్మతు పనుల బాధ్యతలను నల్లగొండ చీఫ్ ఇంజినీర్ చూస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పిలాయిపల్లి కాల్వ ద్వారా భూదాన్ పోచంపల్లి, చౌటుప్పల్, రామన్నపేట, చిట్యాల మండలాల్లో 18 డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్‌లో 46 చెరువులు నిండనున్నాయి. ఈ కాల్వ ద్వారా 22,500 ఎకరాలకు సాగునీరు అందనుంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పనులు కొనసాగాయి.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

రఘునాథపురంలో బ్యాంకు ఏర్పాటు చేయాలని ఆర్‌బీఐ ఏజీఎం లక్ష్మీశావ్యకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

రాజాపేట, డిసెంబర్ 18 : మండలంలోని రఘునాథపురంలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక అక్షరస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌బీఐ ఏజీఎం లక్ష్మీశావ్య మాట్లాడుతూ గ్రామ ప్రజల కోరిక మేరకు గ్రామంలో బ్యాంకు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ప్రతిఒక్కరూ ఆర్థికంగా ఎదుగాలంటే వస్తున్న ఆదాయం నుంచి పొదుపు చేసుకోవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. పొదుపును ఆర్‌బీఐ గుర్తింపు పొందిన సంస్థల్లో మాత్రమే చేసుకోవాలని, ప్రైవేట్ వ్యక్తులను, సంస్థలను నమ్మి మోసపోవద్దని పేర్కొన్నారు. వృథా ఖర్చులు చేయవద్దని, ముఖ్యంగా మహిళలు స్వయం సహాయక సంఘాల నుంచి తీసుకునే రుణాలు ఆదాయ వనరులు పెంచుకునే విధంగా ఉండాలని సూచించారు. జిల్లా ఎల్‌డీఎం శివరామకృష్ణ మాట్లాడుతూ బ్యాంకు ఖాతా లేకుంటే జరిగే నష్టాలను గురుంచి వివరించారు. బ్యాంకులో ఖాతా తెరవడంతో కలిగే ప్రయోజనాలు, రుణాలు, సాధారణ భద్రత పథకాలు ఖాతాదారునికి లభిస్తాయన్నారు. 18 ఏండ్లు నిండిన ప్రతిఒక్కరూ భద్రత పథకాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాడిపెల్లి శ్రవణ్‌కుమార్. మాజీ ఎంపీటీసీ బుడిగె రేణుకాపెంటయ్యగౌడ్, కెనరా బ్యాంకు మేనేజర్, ఆర్థిక అక్షరాస్వత కేంద్రం నోడల్ ఆఫీసర్ సతీశ్, సెంట్రల్ బ్యాంకు మేనేజర్, సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు నాగరాజు, నవీన్, సాయికుమార్, బ్యాంకు మిత్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

మెప్మా, ఆర్పీలకు జీఓ ప్రకారం వేతనం చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాండు, మల్లేశం

ఏఓ జగన్‌మోహన్‌ప్రసాద్‌కు వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 18 : మెప్మా రిసోర్స్ పర్సన్లకు జీఓ 60 ప్రకారం కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి పాండు, కల్లూరి మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ మెప్మా రిసోర్స్ పర్సన్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణాల్లో మహిళా సంఘాలకు రుణాలు ఇప్పించడం, రుణాలు సకాలంలో చెల్లించే బాధ్యత, బుక్ కీపింగ్, ప్రభుత్వ పథకాల ప్రచారం, ఇంటింటికీ మరుగుదొడ్లు నిర్మించే విధంగా కృషిచేయడం తదితర పనులు చేస్తున్న రిసోర్స్ పర్సన్లకు చాలీచాలని వేతనాలు చెల్లించడం సరికాదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా సౌకర్యం రూ.10 లక్షలు కల్పించాలని, డ్రెస్ కోడ్ రాష్ట్ర మొత్తం ఉండేలా చూడాలని అన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ పరిపాలనా అధికారి జగన్మోహన్‌ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు మంచాల మధు, మెప్మా యూనియన్ నాయకులు వసంత, పరమేశ్వరి, పద్మ, భాగ్య, చంద్రకళ, సురేఖ, చంద్రిక, సుజాత, రమ్య, రేణుక, సతీశ్ పాల్గొన్నారు.

కొనసాగు